

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు 94 శాతం పంపిణీ

అనకాపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను గురువారం సాయంత్రానికి 94 శాతం మందికి పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,55,621 మంది పింఛన్‌దారులకు రూ.107.22 కోట్లు మంజూరయ్యాయని, ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 2,40,072 మందికి ఇంటింటికీ వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేసినట్టు చెప్పారు. వివిధ కారణాల వల్ల 15,549 మంది పింఛన్ డబ్బులు అందుకోలేదని, ఈనెల 5వ తేదీలోగా వీరికి కూడా పంపిణీ చేస్తామని శచీదేవి తెలిపారు.

సొంతింటి కల నెరవేరదా?

ఏళ్ల తరబడి టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నిరీక్షణ

- 'అనకాపల్లి' పేదలకు గత టీడీపీ హయాంలో పక్కా ఇళ్లు మంజూరు
- సత్యనారాయణపురం, కొప్పాక, సిరసపల్లిల్లో గ్రూప్ హౌస్‌ల నిర్మాణం
- మౌలిక వసతులు కల్పించే సమయంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ
- రెండేళ్లపాటు పట్టించుకోని పాలకులు
- అనంతరం అనర్హుల పేరుతో పలువురి పట్టాలు రద్దు
- 1,400 ఇళ్లు 'విశాఖ సౌత్' లబ్ధిదారులకు కేటాయింపు
- కాలనీల్లో వసతులు కల్పించకుండా కాలయాపన
- కూటమి ప్రభుత్వంపైనే నిరుపేదల ఆశలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టిడ్కో) అనకాపల్లి నియోజవర్గంలో నిర్మించిన వేలాది ఇళ్లు ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. సత్యనారాయణపురంలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇళ్లన్నీ వృథాగా పడివున్నాయి. కొండకొప్పాక, సిరసపల్లిలో నిర్మించిన ఇళ్లకు సంబంధించి కేసు కోర్టులో నడుస్తుండడంతో లబ్ధిదారులకు అందజేయలేదు. దీంతో సొంత ఇంటి కల సాకారం కాలేదని వేలాది మంది పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇళ్లను నిర్మించేందుకు తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో)ను ఏర్పాటుచేసింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు నోడల్ సంస్థగా 'టిడ్కో' కార్యకలాపాలు సాగించాలి. అనకాపల్లి పట్టణంతోపాటు జీవీఎంసీలో విలీనమైన కొప్పాక, రాజుపాలెం, వల్లూరు ప్రాంతాల్లోని నిరుపేదల కోసం 2018 జనవరిలో అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలోని మెగా లేఅవుట్‌లో 2,744, కొప్పాకలో 288, సిరసపల్లిలో 384 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. జీ ప్లస్ త్రీ తరహాలో నిర్మించే ఈ ఫ్లాట్లను 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంతో మూడు కేటగిరీలుగా విభజించారు. సత్యనారాయణపురంలో పలువురు లబ్ధిదారులకు పట్టాలు సైతం పంపిణీ చేశారు. కొంతమంది గృహప్రవేశాలు కూడా చేశారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. నాటిప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు అక్కడ ఆపేశారు. రెండేళ్ల పాటు టిడ్కో ఇళ్ల ఊసెత్తలేదు. దీంతో పలువురు లబ్ధిదారులు ఆందోళనలు చేయడంతో ప్రభుత్వంలో కదలిక ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో టిడ్కో ఇళ్లు

నర్సీపట్నం టిడ్కో ఇళ్లు వచ్చే నెలాఖరుకు అప్పగింత

- సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ నాగబాబు

నర్సీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను జూన్ నెలాఖరునాటికి లబ్ధిదారులకు అప్పగించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీ టిడ్కో స్టేట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ నాగబాబు తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సురేంద్రపాటు మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. టిడ్కో ఇళ్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన టిడ్కో కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, టిడ్కో గృహసముదాయాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరగా పూర్తిచేయిస్తామని చెప్పారు. ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఆయన చెప్పారు. తర్వాత ఆ డాక్యుమెంట్లను బ్యాంకులకు అందజేస్తే రుణాలు మంజూరు అవుతాయని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా సీవో రమాదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మెప్మా సిబ్బందితో సమావేశమైన ఏపీ టిడ్కో స్టేట్ కోఆర్డినేటర్ నాగబాబు


ఆద్యంతం గందరగోళం

అనుభవం లేని అధికారులతో చందనోత్సవం

- ఉత్సవానికి 50 రోజుల ముందే సెలవుపై వెళ్లిన ఈఓ
- ఇన్‌చార్జి ఈఓగా సుబ్బారావు నియామకం
- చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి తప్పుకున్న సీనియర్ అధికారి భ్రమరాంబ
- మరొకరిని నియమించినా ఎటువంటి బాధ్యతలు అప్పగించని వైనం
- ఒకే ఒక సమావేశంతో సరిపెట్టేసిన మంత్రుల కమిటీ
- కొండపైన ఉన్నా.. ఘటనా స్థలి వద్దకు రాని రెవెన్యూ మంత్రి



సింహగిరిపై ఘటన జరిగినచోట గోడ కట్టకముందు (ఫైల్ ఫొటో)



గోడ కూలడానికి కొద్దిసేపటి ముందు కురుస్తున్న వర్షం



గోడ కూలిన తరువాత...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం ఏటా వివాదాస్పదంగా మారుతోంది. ఈ విషయం అందరికీ తెలుసు. ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావించి అదే విషయాన్ని దేవదాయ శాఖ పెద్దలకు చెప్పింది. నలుగురు మంత్రులతో కమిటీని వేసింది. అయితే ఇక్కడ ఉత్సవానికి ముందు అనేక మార్పులు, సర్దుబాట్లు జరిగిపోయాయి. ఆలయ ఈఓగా వ్యవహరిస్తున్న త్రినాథ్ అమెరికా వెళతానంటే మూడు నెలలు సెలవు ఇచ్చేశారు. ఆయన ఫిబ్రవరి నెలాఖరున ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. చందనోత్సవం ముందు సెలవు పెడితే ఎలా?...అని ఎవరూ ప్రశ్నించలేదు. ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ స్థానంలో సీనియర్ అధికారిని ఎవరినైనా నియమించారా?...అంటే అదీ లేదు. రెవెన్యూ శాఖలో పనిచేస్తూ రాజమహేంద్రవరం ఆర్‌జేసీగా పనిచేస్తున్న సుబ్బారావును తీసుకొచ్చి మార్చి ఒకటో తేదీన ఇన్‌చార్జిగా వేశారు. 92 రోజుల తరువాత మళ్లీ వెనక్కి వెళ్లిపోవాలని ఆయనకు ముందే ఆర్డర్ ఇచ్చారు. మూడు నెలల కాలానికి మనకెందుకులే?...అని ఆయన ఎందులోను తల దూర్చకుండా పైపైన వ్యవహారాలు నడిపిస్తున్నారు. ఏటా ఈ ఉత్సవానికి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను నియమించడం ఆనవాయితీ. ఈసారి అత్యంత సీనియర్, ఇదే ప్రాంతానికి చెందిన భ్రమరాంబను నియమించారు. ఉత్తర్వులు ఇచ్చిన మూడో రోజునే ఆమె వ్యక్తిగత కారణాల వల్ల ఆ బాధ్యతలు నిర్వర్తించలేనని తప్పుకున్నారు. దాంతో ద్వారకా తిరుమల ఈఓ ఎన్‌వీఎస్ఎన్‌మూర్తికి ఆ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే...గత కొన్నేళ్లుగా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను నియమిస్తున్నా వారికి ఎటువంటి కీలక బాధ్యతలు అప్పగించడం లేదు. ఉత్సవ విగ్రహంలా ఉంచుతున్నారు. ఈసారీ అదే జరిగింది. ఈ చందనోత్సవంలో సీనియర్ అధికారులు ఎవరైనా ఉన్నారా అంటే...ఇద్దరే కనిపిస్తున్నారు. వారిలో ఒకరు ఇక్కడే అనేక సంవత్సరాలు ఈఓగా ... మిగతా 6వ పేజీలో

పార్కు స్థలంలో పాగా!

ఎస్‌బీఐ కాలనీలో జిల్లా అధికారి బంగ్లా పేరుతో అడ్డగోలుగా నిర్మాణం

- టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండానే పనులు
- జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల ఇష్టారాజ్యం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఎదుటి వారికి చెప్పేందుకే నీతులు అన్న చందంగా ఉన్నాయి జీవీఎంసీ అధికారుల తీరు. జిల్లా అధికారికి బంగ్లా నిర్మాణం పేరుతో ప్రైవేటు లేఅవుట్ పార్కు స్థలంలో పాగా వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిధులతో అధునాతన హంగులతో నిర్మించిన భవనానికి కనీసం టౌన్‌ప్లానింగ్ అనుమతులు పొందలేదు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం పబ్లిక్ ఫోరం సమన్వయకర్త కాంద్రేగుల వెంకటరమణ జీవీఎంసీ కమిషనర్‌కు దరఖాస్తు చేయడంతో ఈ లొసుగులు బహిర్గతమయ్యాయి. జిల్లా అధికారి ఒత్తిడి వల్లే పార్కు స్థలంలో ప్లాన్ లేకుండానే భవన నిర్మాణం పూర్తి చేసినట్లు స్పష్టమవుతున్నది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని 84వ వార్డులో సుంకరమెట్ట జంక్షన్ నుంచి సబ్బవరం వెళ్లే రోడ్డులో ఎస్‌బీఐ కాలనీ ఉంది. సర్వే నంబర్లు 1,551, 1,558/5లో వున్న దీనికి 1983లోనే వుడా ఆమోదించి ఎల్‌పీ నంబర్ 2/83 కేటాయించింది. నిబంధనల ప్రకారం కాలనీలో సుమారు 22 సెంట్ల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే ఎటువంటి అభివృద్ధి చేయకపోవడంతో ఖాళీగానే ఉంది. ఇదిలావుండగా జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ స్థలంలో జిల్లాస్థాయి ముఖ్య అధికారికి బంగ్లా నిర్మించేందుకు గత వైసీపీ ప్రభుత్వం హయాంలో (సార్వత్రిక ఎన్నికల ముందు) ప్రతిపాదనలు చేయగా, వెంటనే నిధులు మంజూరు చేస్తూ భవన నిర్మాణానికి పరిపాలన పరమైన ఆమోదం ఇచ్చేశారు. జీవీఎంసీ సాధారణ నిధులు సుమారు రూ.80 లక్షలతో ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టారు. ప్రభుత్వ భవనాలకు శంకుస్థాపన అధికారికంగా జరపాలి. కానీ ఇక్కడ శంకుస్థాపన చేయకుండానే భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. భవనం అంచనా వ్యయం, టౌన్‌ప్లాన్, కాంట్రాక్టర్ వివరాలను బోర్డు రూపంలో నిర్మాణ ప్రదేశంలో అందిరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేయాలి. కానీ జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వీటిని పాటించలేదు. కనీసం టౌన్ ప్లాన్ విభాగం నుంచి అనుమతులు కూడా పొందకుండా భవన నిర్మాణం పూర్తి చేశారు. పార్కుకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణంపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణను వివరణ కోరగా.. భవనానికి టౌన్ ప్లాన్ ఉందా లేదా అన్న వివరాలు తన వద్ద లేవన్నారు. గతంలో మంజూరైన నిధులతో భవన నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు.



ఎస్‌బీఐ కాలనీలో ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన భవనం



యూనిటీ మాల్ నమూనా

విశాఖలో యూనిటీ మాల్

రూ.172 కోట్లతో నిర్మాణం

- హస్త కళాకారులు, చేనేత వృత్తిదారులకు ప్రోత్సాహం
- నేడు అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులో తిమ్మాపురం వద్ద కొండ దిగువన రూ.172 కోట్లతో యూనిటీ మాల్ (వాణిజ్య సముదాయం) నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అమరావతి నుంచివర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. హస్తకళలు, చేనేత వృత్తులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మాల్స్ ఏర్పాటు చేస్తోంది. అందులో రాష్ట్రానికి కేటాయించిన మాల్ తిమ్మాపురం వద్ద నిర్మితం కానున్నది. దీనికి ఐదు ఎకరాలు కేటాయించారు. ఈ స్థలంలో 3.5 లక్షల ... మిగతా 6వ పేజీలో

అమరావతికి ఆర్టీసీ బస్సులు

నేటి ప్రధాని సభకు ప్రజల తరలింపు కోసం పంపిన జిల్లా అధికారులు

- అనకాపల్లి నుంచి 25, నర్సీపట్నం నుంచి 35..
- బస్సుల కొరతతో ఇబ్బంది పడిన ప్రయాణికులు



బస్సుల కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజలను తరలించేందుకు జిల్లాలోని రెండు ఆర్టీసీ డిపోల నుంచి 60 బస్సులను అధికారులు పంపారు. అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న విషయం తెలిసిందే. చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో మోదీ సభకు హాజరయ్యేలా ప్రభుత్వం రవాణా సదుపాయాలు కల్పిస్తున్నది. ఇందుకోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అనకాపల్లి డిపో నుంచి 25, నర్సీపట్నం డిపో నుంచి 35.. మొత్తం 60 బస్సులను గురువారం ఉదయమే ఇక్కడి నుంచి రాజధాని ప్రాంత జిల్లాలకు పంపారు. దీంతో అనకాపల్లి నుంచి పలాస, విశాఖపట్నం, పాయకరావుపేట, విజయనగరం, జోలాపుట్టుతోపాటు ఇతర గ్రామీణ సర్వీసుల్లో కోత విధించారు. రాజధానికి పంపిన బస్సులు శనివారం మధ్యాహ్నం తరువాత తిరిగి వస్తాయని అధికారులు చెబుతున్నారు. బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికులు ఎక్కువసేపు వేచి వుండాల్సి వస్తున్నది. బస్సు వచ్చిన వెంటనే ఎక్కడానికి ప్రయాణికులు ఎగబడుతున్నారు. చిన్నపిల్లలు, లగేజీతో బస్సు ఎక్కడానికి మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. పలు మార్గాల్లో నడిచిన బస్సుల్లో సీట్లు నిండిపోయి ప్రయాణికులు నిలబడి ... మిగతా 6వ పేజీలో

ఘనంగా మే డే



అనకాపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

శ్రామిక దినోత్సవం 'మే డే' వేడుకలను యావత్ కార్మిక లోకం గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వాడవాడలా ర్యాలీలు నిర్వహించి ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు.

రీసర్వే గడువు కుదింపు

60 రోజులకు తగ్గించిన ప్రభుత్వం

- గతంలో ఒక గ్రామంలో రీసర్వేకి 120 రోజుల గడువు
- ఒక బ్లాక్‌లో 200-250 ఎకరాలు
- ఇప్పుడు 300 ఎకరాలకు పెంపు



రోలుగుంట మండలం రాజన్నపాలెంలో జరుగుతున్న రీసర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. గతంలో ఒక గ్రామంలో 120 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని నిబంధన ఉండగా.. దీనిని 60 రోజులకు కుదించింది. గ్రామంలో రీసర్వే ర్యాలీ, గ్రామ సభ, రైతులకు నోటీసులు ఇచ్చే ప్రక్రియలను ఒకే రోజులో పూర్తి చేయాలి. గ్రామ సరిహద్దులు నిర్ణయించిన తర్వాత బ్లాక్ సరిహద్దులు నిర్ణయిస్తారు. గతంలో 200-250 ఎకరాలు ఒక బ్లాక్‌గా ఉంటే ఇప్పుడు 300 ఎకరాలను ఒక బ్లాక్‌గా తీసుకుంటున్నారు. సర్వే పూర్తి చేసిన తర్వాత సరిహద్దులు నిర్ణయించి, రోజుల వ్యవధిలోనే భూ యజమానికి పట్టా ఇవ్వాలి. మారిన విధివిధానాలపై సర్వే సిబ్బందికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. వైసీపీ హయాంలో జరిగిన భూ సర్వే తప్పుల తడకగా వుందంటూ ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు ... మిగతా 6వ పేజీలో



ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



ఎలమంచిలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


పాయకరావుపేటలో సీనియర్ భవన నిర్మాణ కార్మికులను సత్కరించిన దృశ్యం



అచ్యుతాపురం జంక్షన్‌లో మే డే వేడుకలు జరుపుతున్న సీఐటీయూ నాయకులు


రాంబిల్లి జంక్షన్‌లో మానవహారం నిర్వహించిన కార్మికులు

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంతోపాటు మండలంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంఘాధ్యక్షుడు అల్లిమల్ల నాగు జెండాను ఎగురవేశారు. రైస్ మిల్లు ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక నేత వీసం వెంకటరమణ ఆర్ఎస్‌రోడ్డు జంక్షన్ వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో నేతలు వై.నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, డి.మహేష్, విశ్వనాథం, కాసుబాబు, జైరామ్, ఎన్.శివ పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం జంక్షన్ నుంచి బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు,నాయకులు శ్రీనివాస్, ఎన్.సత్యనారాయణ, లక్ష్మి, రేవతి, జ్యోతి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తాపీ మేస్త్రీల సంఘం కార్యాలయ ఆవరణలో సంఘ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ భవన నిర్మాణ కార్మికులు కూండ్రపు చిన్నారావు, చిడం రాములబ్బాయి, బీరా ధనరాజు, గంపల త్రిమూర్తులు, గోసు నాగరాజులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద శ్రీను, మేకల సత్తిబాబు, పంపనబోయిన చంటి, చిడం శ్రీను, ఎరకయ్య, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మండలంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. అచ్యుతాపురం జంక్షన్, దోసూరు, పూడిమడక, తిమ్మరాజుపేట, హరిపాలెం, దుప్పితూరు, కుమాపురం, బార్కులతోపాటు సెజ్‌లో పలు కర్మాగారాల వద్ద పతాకావిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.సోమునాయుడు, రాజాన అప్పలనాయుడు, రెడ్డి సన్నిబాబు, నిమ్మాడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు

మునగపాకలో..

మండలంలో పలు గ్రామాల్లో కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం ఎర్రజెండాలు రెపరెపలాడాయి. మునగపాక, గవర్ల అనకాపల్లి, నాగులాపల్లి గ్రామాల్లో గురువారం మే డే వేడుకలు జరిగాయి. స్థానిక ఎస్‌టీబీ, ఆటోస్టాండ్‌ల వద్ద, గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద, చూచుకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలోను, నాగులాపల్లి, ఉమ్మలాడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు. ఆయా వేడుకల్లో కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, ఆళ్ల మహేశ్వరరావు, కాండ్రేగుల రాము, వైఎన్.భద్రం, నాయుడు మల్లికార్జునరావు, శ్రీరామదాసు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తపట్నం, నేవీ గేట్, రాంబిల్లి, గజిరెడ్డిపాలెం, లోవపాలెం, మామిడివాడ, బోగాపురం, వెంకటాపురం, వైలోవ, పెదకవలాపల్లి, వెల్బూరుల్లో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. నేవీ గేటు నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాంబిల్లి జంక్షన్‌లో మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, నాయకులు రామకృష్ణ, నారాయణరావు, కాశియ్య, గంగరాజు, నూకన్న, అంగన్‌వాడీ, ఆశపాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరం, అడ్డరోడ్డు, నీలాద్రిపురం, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో సీఐటీయూ నాయకుడు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాలను ఎగరవేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మామిడి నానాజీ, అప్పన్న, గోవింద్, వరహాలు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆటో, భవన నిర్మాణ కార్మికులు, పెయింటింగ్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమక్షంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు ఎం.రాజేశ్ దుర్గారాణి, బండారు మణికంఠ, గుడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరదా?

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. అయితే లబ్ధిదారుల్లో పలువురు అనర్హులు వున్నారంటూ వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో సర్వే చేయించి, పలువురి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. వీరికి సంబంధించిన పట్టాలను రద్దు చేశారు.

విశాఖ దక్షిణం లబ్ధిదారులకు అనకాపల్లిలో ఇళ్లు!

సత్యనారాయణపురంలోని టిడ్కో కాలనీలో రెండు వేల ఫ్లాట్లను అనకాపల్లి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు, 744 ఫ్లాట్లను విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని వారికి 2022లో వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. వీరిలో 2,529 మంది రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారు. ఇంకా 215 మంది రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్రజాప్యం చేసింది. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిపోయాయి. గత ఏడాది సాధారణ ఎన్నికల ముందు టిడ్కో కాలనీలకు మౌలిక వసతులు కల్పించేందుకు వైసీపీ నాయకులు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. కానీ పనులు మాత్రం కొనసాగలేదు. కొంతమంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. సత్యనారాయణపురం టిడ్కో కాలనీలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో గతంలో గృహప్రవేశాలు చేసినవారు ఇళ్లకు తాళాలు వేసుకుని, అద్దె ఇళ్లల్లో వుంటున్నారు.

కోర్టు పరిధిలో కొండకొప్పాక, సిరసపల్లి ఇళ్లు

కొండకొప్పాకలో 288 ఇళ్లు నిర్మించగా.. వైసీపీ పాలకులు వీటిలో తొమ్మిది ఇళ్లను మాత్రమే అనకాపల్లి నియోజకవర్గ పేదలకు కేటాయించి, మిగిలిన 279 ఇళ్లను విశాఖ దక్షిణ నియోజకవర్గం లబ్ధిదారులకు కేటాయించారు. సిరసపల్లిలో నిర్మించిన 384 ఇళ్లల్లో అనకాపల్లి నియోజకవర్గానికి 13 మాత్రమే కేటాయించారు. మిగిలిన 371 ఇళ్లను విశాఖ దక్షిణ నియోజకవర్గం లబ్ధిదారులకు ఇచ్చేశారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో వుంది. కోర్టులో కేసు తేలిన తరువాతే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. గత ఏడాది ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టిడ్కో ఇళ్ల స్థితిగతులపై పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల ద్వారా సర్వే చేయించింది. దీంతో టిడ్కో ఇళ్ల కేటాయింపులు త్వరగా జరుగుతాయని లబ్ధిదారులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రీసర్వే గడువు కుదింపు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టింది. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో ఆయా గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించడంతో రీసర్వే బాధితులు పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు, ఫిర్యాదులు అందించారు. మిగిలిన గ్రామాల్లో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. నర్సీపట్నం డివిజన్‌లో 357 గ్రామాలు ఉండగా వైసీపీ హయాంలో 208 గ్రామాల్లో సర్వే చేపట్టారు. మిగిలిన వాటిలో 12 గ్రామాల్లో మొదటి విడత రీసర్వేని జనవరి 20 నుంచి ప్రారంభించారు. రెండో విడత మరో 15 గ్రామాలు చేర్చి 27 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతీ 300 ఎకరాలకు ఒక సర్వే బృందం పని చేస్తున్నది. ఈ బృందంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు ఇద్దరు, వీఆర్‌వో, వీఆర్ఏ ఉంటారు. మండల సర్వేయర్, ఒక వీఆర్వో ఈ బృందానికి సపోర్టు ఉంటారు. మొదట విడత 12 గ్రామాల్లో సర్వే పనులు ముగింపు దశకు వచ్చాయి. రెండో విడత 15 గ్రామాల్లో సర్వే పనులు వివిధ దశల్లో వున్నాయి. అయితే కొన్నిచోట్ల రైతుల మధ్య సరిహద్దు వివాదాలు, రైతుల వద్ద సరైన రికార్డులు లేకపోవడం, ఉమ్మడి కుటుంబాల్లో ఆస్తుల పంపకాలు జరగకపోవడం వంటివి రీ సర్వేకి ఆటంకంగా మారాయి.

రీసర్వేకి రైతులు సహకరించాలి

ఎంఆర్‌పీ బాబు, జిల్లా సర్వేయర్

ఎండ తీవ్రత కారణంగా మండల, గ్రామస్థాయి సర్వేయర్లు ఉదయం 7.30 గంటలకే క్షేత్ర స్థాయిలో ఉండాలని ఆదేశించాం. గ్రామ సచివాయల సర్వేయర్లు విధిగా ఆన్‌లైన్ హాజరు వేయాలి. రైతులు తమ హక్కు పత్రాలు చూపించి సర్వే సిబ్బందికి సహకరించాలి. రీసర్వే పూర్తయితే పక్కాగా రికార్డు రైతుల చేతిలో ఉంటుంది.

అమరావతికి ఆర్టీసీ బస్సులు

... 5వ పేజీ తరువాయి

వెళ్లాల్సి వచ్చింది. అమరావతిలో మోదీ సభకు ప్రజలను తరలించడానికి ఆ ప్రాంతంలో వున్న ఆర్టీసీ బస్సులతోపాటు విద్యాసంస్థల బస్సులు తీసుకుంటే సరిపోయేదని, అనకాపల్లి జిల్లా నుంచి బస్సులు పంపడం వల్ల రెండు రోజులపాటు స్థానిక ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు : రంగనాయకులు


దూళి రంగనాయకులను సన్మానిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు ఎనలేని గుర్తింపు దక్కిందని యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు అన్నారు. గురువారం స్థానిక కొత్తపేటలో యాదవ సంఘం ప్రతినిధులు, స్థానికులు దూళి రంగనాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు అన్ని రంగాల్లోనూ ఎనలేని ప్రాధాన్యత లభించిందన్నారు. బీసీలంతా టీడీపీకి వెన్నుదన్నుగా ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నేతలు దూలి దేవుళ్లు, కోన శంకర్, వియ్యపు సత్తిబాబు, చీర అచ్చిబాబు తదితరులు రంగనాయకులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గొలగాని సన్నిబాబు, నీలాద్రి, వై.సత్యారావు, సారిపల్లి కృష్ణ, కె.శంకరరావు పాల్గొన్నారు.

రేగుపాలెంలో పర్యటించిన డీపీవో


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి గురువారం పర్యటించారు. అనంతరం ఎంపీడీఓ కొండలరావుతో కలిసి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. పంచాయతీలో క్రమం తప్పకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాలక్ష్మి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికుల భద్రతే ముఖ్యం

» నాయకులు గెడ్డం బుజ్జి,తోట నగేశ్, శివదత్


సభ్యత్వాల నమోదు కిట్లను పంపిణీ చేస్తున్న జనసేన నేతలు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్

నక్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమంతోపాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసే జనసైనికుల భద్రతే ముఖ్యమని జనసేన పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు. గురువారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో జనసేన సభ్యత్వాల కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నాలుగు మండలాల్లో 14,353 సభ్యత్వాలు జరగడం గొప్ప విశేషమన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన గెడ్డం చలపతి, నల్లల రత్నాజీ, పిక్కి స్వామిలను పార్టీ పెద్దలు అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో పార్టీ సైనికులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో గెడ్డం చైతన్య, ఆకేటి గోవిందరావు, వెలగా సుధాకర్, కురందాసు అప్పలరాజు, దుర్గారావు, పప్పల శివ, వై.నానాజీ, దేవవరపు రఘు, సంజీవరావు, పాము గణేశ్, జగ్గన్నదొర, చంద్రరావు, బంగారి రాజు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎలమంచిలి 21వ వార్డు కమిటీ ఎన్నిక

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని 21వ వార్డు మంత్రిపాలెం, గొల్లలపాలెం టీడీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బొద్దపు శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ టీడీపీ నేతల ఆదేశానుసారం కమిటీ నియామకం చేపట్టామన్నారు. కమిటీ అధ్యక్షుడిగా ముమ్మిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి తాతాజీ, వైస్ ప్రెసిడెంట్‌గా నేలపూడి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షుడు బొద్దపు నాగేశ్వరరావు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు నమ్మి రమణ, నేతలు జెర్రిపోతుల అప్పారావు, అనుసూరి కృష్ణ, వెంకటస్వామి, సూరిబాబు, ఎం. సత్తిబాబు, కోన చిరంజీవి పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పాసైన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్ టీసీ, కులం, ఆధార్‌కార్డు, కలర్ ఫొటో, ఈమెయిల్ అడ్రస్, ఆధార్ కార్డుకు లింకుఅయిన ఫోన్ నంబరుతో పట్టణంలోని ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

ఆద్యంతం గందరగోళం

... 5వ పేజీ తరువాయి

పనిచేసి ప్రస్తుతం దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న రామచంద్రమోహన్, మరొకరు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు. వారికి ఉత్సవాల నిర్వహణలో అపార అనుభవం ఉంది. కమిషనర్ కూడా గత వారం రోజులుగా ఇక్కడే ఉండి అన్నీ చూసుకుంటున్నారు. ఇంత పెద్ద ఉత్సవాలు ఒకరిద్దరి చేతులు మీదుగా కాకుండా ఎక్కువ మంది బాధ్యతలు పంచుకొని ఉంటే బాగుండేదని, ఈఓ త్రినాథ్‌కు సెలవు ఇవ్వకుండా ఉండాల్సిందని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించినా క్షేత్రస్థాయిలో ఉండి చూసుకోవలసింది దేవదాయ శాఖ అధికారులే కావడం వల్ల ఇప్పుడు నింద వారిపైనే పడింది. ప్రభుత్వం నలుగురు మంత్రులతో కమిటీని నియమించింది. వారంతా ఒకసారి సమావేశం నిర్వహించారు. ఆ తరువాత అన్నీ హోం మంత్రి వంగలపూడి అనితే చూసుకున్నారు. ప్రమాద ఘటన జరిగిన తరువాత రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటివరకూ కనిపించలేదు. అనగాని సత్యప్రసాద్ స్వామి దర్శనం చేసుకొని వెళ్లిపోయారు. ఎవరూ తమకు పట్టని వ్యవహారంలానే భావించారు. సహాయక చర్యల నుంచి మృతదేహాలకు పోస్టుమార్టం వరకూ హోం మంత్రి అనిత దగ్గరుండి చూసుకున్నారు. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అడపాదడపా వెళ్లి ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. ఇక ఎంపీ ఎం.శ్రీభరత్‌కు ఈ ఉత్సవ ఏర్పాట్లలో భాగస్వామ్యమే కల్పించలేదు. ఆయన్ను ఏ సమావేశానికీ ఆహ్వానించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశాఖలో యూనిటీ మాల్

... 5వ పేజీ తరువాయి

చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.110 కోట్లతో జీ+4 భవనం నిర్మిస్తారు. ఇంటీరియర్ డెకరేషన్, ఇతర వసతులకు రూ.62 కోట్లు ఖర్చు చేస్తారు. వచ్చే ఏడాది మార్చికల్లా దీని నిర్మాణం పూర్తవుతుంది. యూనిటీ మాల్ మొదటి రెండు అంతస్థుల్లో 62 షాపులు వుంటాయి. మూడో అంతస్థు నుంచి సముద్రం చూసేలా వ్యూపాయింట్ ఏర్పాటుచేస్తారు. నాలుగో అంతస్థులో కన్వెన్షన్ హాలు, రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు, రిక్రియేషన్ జోన్, ఫిట్‌నెస్ సెంటర్, బ్యాంకు శాఖలు, ఫర్నీచర్ స్టోర్లు ఉంటాయి. ఏటికొప్పాక బొమ్మలు సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారుచేసే చేతివృత్తులు ఈ మాల్‌లో విక్రయిస్తారు.

'పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

నక్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ సూచించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన పలువురికి పార్టీ సభ్యత్వాల గుర్తింపు కార్డులు అందజేశారు. సమావేశంలో ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, నాయకులు అద్దూరి భూషణం, కక్కిరాల సురేశ్, లోవ రాజు,మీసాల బాబులు, కేవీ సత్యనారాయణ, కొప్పిశెట్టి వీరబాబు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒంపోలు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ కేఎస్.గణేష్ తెలిపారు. ఒంపోలు గ్రామంలో శ్రీకృష్ణుడు మందిరం నుంచి కశింకోట వైపు మార్గంలో గురువారం తనిఖీలు నిర్వహించామన్నారు. ఒంపోలు గ్రామానికి చెందిన పడాల అప్పలనాయుడు వద్ద ఏడు మద్యం సీసాలు ఉన్నాయని చెప్పారు. వాటిని సీజ్‌చేసి అప్పలనాయుడుపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

ఎన్‌రోల్‌మెంట్ పెంపుపై ఉపాధి కూలీలకు అవగాహన

కోటవురట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడిలో పాఠశాలలకు విద్యార్థులను పంపడంపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఆ గ్రామంలో 480 మంది విద్యార్థులు ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో గురువారం కొడవటిపూడి గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉపాధి పనులు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్, లోవరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ఎస్.రాయవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో గురువారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఈ పాఠశాలలోని 1999-2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట ఆత్మీయంగా సమావేశమయ్యారు. చాలాకాలం తరువాత అందరూ కలవడంతో ఒరికినొకరు ప్రేమగా పలకరించుకుంటూ.. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అందరూ ఆటపాటలతో ఎంతో సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులంతా కలిసి విందు భోజనం చేశారు.

మత బోధనలపై ఎంఈఓల విచారణ

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట పెదపల్లి స్కూలు హెచ్‌ఎం. వీఎస్‌ఎం. బాలు మత బోధనలు చేయిస్తున్నారని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఎంఈవో మీనాక్షి, అరుణ్‌కుమార్ విచారణ చేపట్టారు. గురువారం పెదపల్లి స్కూలులో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై ఎంఈఓ మీనాక్షిని ఫోన్‌లో అడగ్గా..ఉన్నతాధికారుల ఆదేశానుసారం దర్యాప్తు చేశామని, నివేదికను అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు.

నీటి ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎంపీడీవో

నక్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యపేట, డొంకాడ ఎస్సీ కాలనీల్లో ఎంపీడీవో పర్యటించారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షాలకు రెండు కాలనీల్లో మట్టి రోడ్లపై నిలిచిపోయిన నీటిని పరిశీలించారు. డొంకాడ ఎస్సీ కాలనీలో వర్షపు నీరు పోవడానికి అనువుగా కల్వర్టు నిర్మాణానికి రూ. 3లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించినట్టు చెప్పారు. రమణయ్యపేటలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ మట్టి కారణంగా కొంత ఇబ్బంది ఏర్పడిందని, ప్రస్తుతం ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.

పార్టీ పటిష్ఠానికి పాటుపడాలి

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి


పెద్దిపాలెంలో జనసేన జెండా ఆవిష్కరిస్తున్న గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. మండలంలోని గోపాలపట్నం శివారు పెద్దిపాలెం, కుమారపురం శివారు పెద్దూరు గ్రామాలలో గురువారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాల జనసేన అధ్యక్షులు యగదాసు నానాజీ, వెలగా సుధాకర్, పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, జనసేన నాయకులు జగ్గన్నదొర, గోళ్ల సన్యాసిరావు, జోగిరాజు, తుమ్మల గణేశ్, నక్కా సాంబయ్య, గరికిన స్వామి, మామిడి లోవరాజు, ముత్తి కిరణ్, ప్రసాద్, కోడా జ్యోతి, కిల్లాడ ఏసు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మండలంలోని రేగుపాలెం సమీపంలోని ఇన్నాకార్డు వేర్‌హౌస్ ఆవరణలో కార్మికులతో సమావేశం నిర్వహించినట్లు ఎలమంచిలి సహాయ కార్మిక శాఖ అధికారి ఎస్. వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి విజయ కార్మిక చట్టాలు, హక్కులు గురించి వివరించినట్లు తెలిపారు. కార్మిక చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.

రాజవరంలో ఘనంగా బోనాల ఊరేగింపు


రాజవరంలో బోనాలను తీసుకువెళుతున్న మహిళలు

పాయకరావుపేట రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరంలో గురువారం బోనాలను ఘనంగా ఊరేగించారు. గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయాలలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. నూకాలమ్మ, కాశీయమ్మ, వరిచిట్టెమ్మ, గొల్ల మారెమ్మ, భూలోకమ్మ, పరదేశమ్మ, జగన్నాథస్వామి, పోతురాజు ఆలయాలను నిర్మించినట్టు గ్రామ పెద్దలు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం బోనాలను ఊరేగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజవరం, గజపతినగరం గ్రామాలకు చెందిన మహిళలు, యువతీ, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లవరపు వీరభద్రరావు జయంతి

పాయకరావుపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళిత నాయకుడు, దివంగత మల్లవరపు వీరభద్రరావు 60వ జయంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లవరపు వీరభద్రరావు చిత్రపటానికి సీఐ జి.అప్పన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుందూరు రాణా, మల్లవరపు ప్రదీప్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు తుమ్మలపల్లి కుమార్, వేమగిరి లక్ష్మణరావు, తుమ్మలపల్లి లక్ష్మణరావు, తాతబ్బాయి, పండు పాల్గొన్నారు.

నాగులాపల్లికి గుర్తింపును తీసుకు వచ్చిన యల్లపు

మునగపాక, మే 1 (ఆంధ్రజోతి): మండలంలో నాగులాపల్లి గ్రామానికి గుర్తింపు తెచ్చిన వారిలో స్వర్గీయ యల్లపు వెంకట సూర్యనారాయణ ఒకరని సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలో నాగులాపల్లి పాల సొసైటీ వద్ద గురువారం సూర్యనారాయణ 23వ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్మన్‌గాను, సహకార సంఘం అధ్యక్షుడుగాను ఆదర్శవంతమైన పదవులను చేపట్టారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త చదరం శివాజీ, మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు, భీమరశెట్టి భాస్కరరావు బొడ్డేడ గోవింద పాల్గొన్నారు.

'పప్పల'ను కలిసిన కోట్ని బాలాజీ


పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న కోట్నీ బాలాజీ

రాంబిల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ గురువారం దిమిలిలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు నేతలతో కలిసి చలపతిరావును సత్కరించి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చలపతిరావు బాలాజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'యువత విద్యతోపాటు క్రీడల్లోను రాణించాలి'

రాంబిల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి):యువత విద్యతోపాటు క్రీడల్లోను రాణించాలని రాంబిల్లి సీఐ నర్శింగరావు అన్నారు. మండలంలోని ఆర్. నర్సాపురంలో బండిమాంబ యూత్ ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు అభినందనీయమన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు పెదపల్లి శ్రీను, లాలం సాంబ మూర్తి, కె.మాణిక్యం, బి.వెంకటరావు తదితరులు తెలిపారు. కార్యక్రమంలో పలు జట్ల క్రీడాకారులు, స్థానిక పెద్దలు, బండిమాంబ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో కొత్తమ్మతల్లికి పూజలు

ఎస్.రాయవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో కొత్తమ్మతల్లి ఆలయాన్ని పునర్నిర్మాణం చేయడానికి గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని అక్కడ పక్కకు మార్చడం కోసం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఉన్న చోట నుంచి మరో చోటకు మార్చారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి


లిఖిత (ఫైల్ ఫొటో)

పరవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలోని ధర్మారాయుడుపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆ బాలిక తల్లిదండ్రులతో పాటు తమ్ముడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామానికి చెందిన కాకి శ్రీను, రేవతి దంపతులకు కుమార్తె లిఖిత(7), కుమారుడు దీక్షిత్(5) ఉన్నారు. శ్రీను ఆటో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె లిఖిత ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం నలుగురు కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి పెదగంట్యాడలో ఉంటున్న బంధువుల ఇంటికి బయలుదేరారు. సరిగ్గా వీరు ధర్మారాయుడుపేట ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి అదే రహదారిలో వెనుక నుంచి వచ్చిన కారు వీరిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీను వాహనం అదుపుతప్పకుండా కంట్రోల్ చేసే క్రమంలో అదే రహదారిలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో భార్య, భర్తతో పాటు కుమారుడు దీక్షిత్ స్వల్పగాయాలతో బయటపడగా లిఖిత రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో కుమార్తెను తొలుత పరవాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అగనంపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ బిక్షప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండకొప్పాకలో రెండిళ్లలో చోరీ

- బంగారం, వెండి నగలు, నగదు అపహరణ
- నిందితులకోసం పోలీసులు గాలింపు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి, రూరల్ సీఐ అశోక్‌కుమార్

కొత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని ఓ గ్రామంలో రెండు ఇళ్లలో బుధవారం రాత్రి చోరీలు జరిగాయి. ఇందుకు సంబంధించి రూరల్ అదనపు ఎస్ఐ జక్కు నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి. కొండకొప్పాక గ్రామానికి చెందిన రిటైర్డ్ షిప్‌యార్డు ఉద్యోగి మరుపాక సత్యనారాయణ మూడు రోజుల క్రితం కూర్మన్నపాలెంలో ఉంటున్న వియ్యంకుడు ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన చోరులు బుధవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి తులం బంగారు చైను, పావు తులం ఉంగరం, రూ.ఐదు వేల నగదు అపహరించుకుపోయారు. అదే విధంగా ఇక్కడికి కూతవేటు దూరంలో ఉన్న రిటైర్డ్ హెచ్ఎం పీలా బాలగణపతిరావు ఇరవై రోజుల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కుమారుడు ఇంటికి వెళ్లారు. ఈ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు పగులగొట్టి రెండు కిలోల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరించుకుపోయారు. వీటిపై అందిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ ఎం.శ్రావణి, రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ ఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. ఈ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయినగర్‌లో...

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలివి. సాయినగర్ కాలనీ నివాసముంటున్న ఏఎంఏఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్ బుధవారం ఇంటి తలుపులకు తాళాలు వేసి కళాశాలకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి వెనుక ఐరన్ గేట్లు తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి లోపల గదుల్లో పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో పాటు అందులోని సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లోని ల్యాప్‌టాప్, కారు తాళాలు, బ్యాగ్ ను అగంతకులు తస్కరించుకుపోయారు. ఈ ఘటనపై గురువారం రాత్రి బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

23 గ్రాముల బంగారు గొలుసు రికవరీ

- ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విష్ణుస్వరూప్



వివరాలు వెల్లడిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో చేరుకున్న ఓ వ్యక్తి మెడలోని బంగారు గొలుసును అపహరించిన ముగ్గురిని అరెస్టు చేసి, 23 గ్రాముల బంగారు గొలుసును రికవరీ చేశామని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 26వ తేదీ రాత్రి పెందుర్తి దరి చినముషిడివాడకు చెందిన శ్రీనాథుల జగన్నాథం సబ్బవరం వస్తూ ప్రమాదానికి గురై రోడ్డుపై పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ మర్నాడు తన మెడలోని బంగారు గొలుసు అపహరణకు గురైందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ దివ్య, మరో ఎస్ఐ సింహాచలం సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. గత నెల 26వ తేదీ రాత్రి 3 నుంచి 4 గంటల మధ్య ఆ మార్గంలో రాకపోకలు సాగించిన వాహనాలను గుర్తించారు. ఇందులో ముగ్గురిపై అనుమానం రావడంతో విచారణ జరిపారు. పెందుర్తికి చెందిన సయ్యద్ నిజాముద్దీన్, మాడుగుల నవీన్‌కుమార్, పెరమాళ్ల చంద్రశేఖరరావులను విచారించగా తామే అపహరించి బంగారు దుకాణంలో విక్రయించినట్టు అంగీకరించారు. బంగారు గొలుసును రికవరీ చేసి ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన ఎస్ఐలు దివ్య, సింహాచలంను డీఎస్పీ అభినందించారు.

అగ్ని ప్రమాదంలో పాన్‌షాప్ దగ్ధం

- రూ. రెండు లక్షల మేర నష్టం

పరవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సంతబయలు వద్ద గల పాన్‌షాప్‌లో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పరవాడ రామాలయం వీధికి చెందిన తేలు అప్పలరాజు సంతబయలు వద్ద పాన్‌షాప్ పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం రాత్రి షాపునకు తాళం వేసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో పాన్‌షాపు లోపల నుంచి పొగ రావడాన్ని అటుగా వెళ్తున్నవారు గుర్తించి యాజ మానికి సమాచారమిచ్చారు. అప్పటికే అగ్నికీలలు షాపు మొత్తం వ్యాపించాయి. షాపులో గల ల్యాప్‌టాప్, ఫ్రిజ్, జెరాక్స్ మిషన్‌తో వంటి వాటితో పాటు సామగ్రి మొత్త కాలి బూడిదయ్యాయి. వీఆర్వో ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా బాధితుడు కోరుతున్నాడు.



అనకాపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు


రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో...


పరవాడ ఫార్మాసిటీలోని విజయశ్రీ ఫార్మా పరిశ్రమ వద్ద...

వాడవాడలా అరుణ పతాకం రెపరెపలు

- ఘనంగా కార్మిక దినోత్సవం
- హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం అని కార్మిక నేతల పిలుపు



రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో ర్యాలీ

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మిక దినోత్సవాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద , బేవరేస్ ఎంప్లాయీస్ యూనియన్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం పతాకావిష్కరణ చేశారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద నాయకులు గంటా శ్రీరామ్, కొండలరావు, ఏసురాజు జెండాను ఎగురవేశారు. బాటా సెంటర్ వద్ద ముఠా కార్మిక సంఘం నాయకులు బీశెట్టి అప్పారావు, ఆర్ఏఆర్ఎస్ వద్ద కె.నందీశ్వరరావు, బైపాస్ జంక్షన్ వద్ద మందా రాము, ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని పలు కూడళ్లలో సీఐటీయూ నాయకులు మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ కార్మికులకు శుభాకాంక్షలు తెలి పారు. అంతా ఐక్యం గా ముందుకు సాగి తద్వారా కార్మిక హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు వారాధి సత్యనారాయణ, కాండ్రేగుల రాంబాబు, అజయ్, పీఎస్‌వీ పరమేశ్వరరావు, అల్లు రాజు, చలపతి, తేలయ్యబాబు, ఆశ వర్కర్లు సూర్యకళ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. డిపో కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, ఎస్.కృష్ణ జెండా ఆవిష్కరణ చేశారు. మాజీ కౌన్సిలర్ తాకాశి వెంకటేశ్వరరావు, అబ్బులు, ప్రసాద్, సతీష్, పరదేశి, ఏఎస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా. ఉడ్‌పేట వాటర్ ట్యాంక్ వద్ద జరిగిన వేడుకల్లో భవన నిర్మాణ కార్మికులకు ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథబాబు మిఠాయిలు పంచిపెట్టారు.

కొత్తూరు : అనకాపల్లి రిక్షా కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా ప్రతినిధి సూదికొండ మాణిక్యాలరావు జెండాను ఆవిష్కరించి మాట్లారు. గురుంపల్లి వెంకట్రావు, నీలకంఠం, సోమనాయుడు, జగ్గారావు, నూకఅప్పారావు, సన్యాసిరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : కార్మిక దినోత్సవాన్ని ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మార్టూరు, బవులువాడ, మామిడిపాలెం తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకుడు కోన మోహన్‌రావు జెండాను ఎగురవేశారు. సీపీఐ కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అరుణ పతాకాన్ని ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : పారిశ్రామిక ప్రాంతం పరవాడలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిటీలోని విజయశ్రీ ఫార్మా పరిశ్రమ సమీపంలో సీఐటీయూ నాయకుడు కృష్ణ జెండా ఆవిష్కరించారు. ఐవోసీ ప్లాంట్ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కర్రి పోతినాయుడు జెండాను ఎగురవేశారు. సింహాద్రి జంక్షన్‌లో సీఐటీయూ నాయకుడు నాగ అప్పారావు జెండా ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టిసత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద జెండాను కార్మిక నాయకుడు పి.పోతునాయుడు ఆవిష్కరించి మాట్లాడారు. పరవాడ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.


సబ్బవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో...

సబ్బవరంలో...

సబ్బవరం : కార్మిక దినోత్సవాన్ని మండలంలో నిర్వహించారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయం వద్ద యూనియన్ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి పలువురి కార్మికులతో కలిసి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు వీవీ రమణమ్మ, చంటి, కోటేశ్వరరావు, పప్పుల కోటి, రమణమ్మ, గౌరీసు తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేయండి

అధికారులు, ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ సంస్థకు ఎమ్మెల్యే పంచకర్ల సూచన


నిర్మాణం సంస్థ ప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం సమీపంలో గల పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం పూడ్చివేసిన చెరువును గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన ఆయకట్టు రైతులు, రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయకట్టు రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఈ అంశాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. చెరువు గర్భంలో ఎంత తీసుకున్నారో అంత భూమిని సేకరించి, నీటి నిలువ సామర్థ్యం తగ్గకుండా చెరువును తవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఇరిగేషన్ జేఈ నళిని, ఆర్ఐ వీరయ్య, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, కిల్లి వెంకట సత్యనారాయణ, బలిరెడ్డి అప్పారావు, ఇందలి రమణ, బోకం స్వామినాయుడులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కంటెంజెంట్ వర్కర్లు సమ్మె



సమస్యల పరిష్కారానికి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వర్కర్లు

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఎం కంటెంజెంట్ వర్కర్లు గురువారం సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కంటెంజెంట్ వర్కర్లుగా పీహెచ్‌సీల్లో 20 నుంచి 30 ఏళ్ల పైబడి సేవలందిస్తున్నామన్నారు. సర్వీసును రెగ్యులర్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేలు, నిర్దిష్టమైన జాబ్ చార్టు అమలు, ఎనిమిది గంటల పనివేళలు, షిఫ్ట్ డ్యూటీ విధానం అమలు వంటివి చేయాలన్నారు. ఈ ర్యాలీలో యూనియన్ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో వర్కర్లు పాల్గొన్నారు.

4న నీట్

- విశాఖలో 16 పరీక్ష కేంద్రాలు
- మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష
- విద్యార్థులు గంట ముందే హాజరవ్వాలి
- ఒంటిగంటకల్లా గేట్లు మూసివేత

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్)లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'నీట్' ఈనెల నాలుగో తేదీన నగరంలోని 16 కేంద్రాల్లో జరగనున్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రవేశ పరీక్షకు సుమారు ఐదు వేల మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు జరగనున్న పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థులను ఉదయం 11 నుంచి కేంద్రాలకు అనుమతిస్తారు. ఒంటి గంట తరువాత కేంద్రాల గేట్లు మూసివేస్తారు. అంటే గంట ముందే కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలి.

ఉత్సాహంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


కోడూరులో మహిళలకు పింఛన్ నగదు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. మండలంలోని కోడూరు పంచాయతీ శివారు ఎస్సీ కాలనీలో పలువురు లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పింఛన్ల నగదును అందజేశారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వారికి వినిపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, సర్పంచ్ సేనాపతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'హిట్-3' విజయోత్సవం


కేక్ కట్‌చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : హీరో నాని నటించిన హిట్-3 చిత్రం విజయోత్సవ వేడుకలు గురువారం పట్టణంలోని పర్తిసాయి షిర్డీసాయి థియేటర్ల ఆవరణలో అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. అనకాపల్లి జిల్లా నాని ఫ్యాన్స్ అధ్యక్షులు గౌరీపట్నపు సురేష్ విజయోత్సవ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే ప్రేక్షకులకు మజ్జిగ ప్యాకెట్లు ,పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుప్పల సాయి, మణికంఠ, అరుణ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత

కశింకోట, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గినపాలేనికి చెందిన ముప్పిన సూరిబాబు గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతనికి చెందిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రెండు నెలలకు సంబంధించి ఎనిమిది వేల రూపాయల నగదును టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కలగా సోమేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నేరుగా అందజేశారు.

వాడచీపురుపల్లి టీడీపీ కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గాన్ని అభినందిస్తున్న మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు

పరవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి టీడీపీ గ్రామ కమిటీ కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వియ్యపు ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షులుగా చీకటి ఆదినారాయణ, కొమ్మోజు రాజు, ప్రధాన కార్యదర్శిగా పెదపూడి పద్మ, కార్యవర్గ సభ్యులుగా మరి కొంతమంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు కూం ద్రపు శ్రీనివాసరావు, లాలం ఈశ్వరరావు, గొరుసు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల బాలుడి ఆపరేషన్‌కు రూ.లక్ష విరాళం

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలల బాలుడికి ఆపరేషన్‌కు ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసి తమ గొప్ప మనసును చాటుకున్నారు. గొలుగొండ మండలం చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్.నవీన్ కుమార్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఇతని ఆరు నెలల కుమారుడికి గుండెలో రెండు హోల్స్ ఉన్నందున ఆపరేషన్ నిమిత్తం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు విరాళాలను సేకరించారు. సదరు నగదు రూ.లక్ష చెక్కును గురువారం ఇక్కడ నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షులు తిరుపతిబాబు, జిల్లా అధ్యక్షురాలు కె.గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ వేడుక



లంకెలపాలెం, మే 1 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ శివారు గండివానిపాలెంలో దుర్గమాంబ పండుగ గురువారం ఘనంగా జరిగింది. వేకువజామున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం నరసింగరావు, చిన్నారావు, ఆర్సి అప్పారావు, నాగఅప్పారావు, పైడిరాజు, గుండు నూకరాజు, బలిరెడ్డి కనకరాజు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు 20 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, మే 1 (ఆంధ్రజ్యోతి) : సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ, గొటివాడ, ఆరిపాక, అంతకాపల్లి, అసకపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మలునాయుడు పాలెం, అయ్యన్నపాలెం, బంగారమ్మపాలెం, నాయన మ్మపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలిభీమవరం, అడ్డూరు గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

80 మందికి కంటి వైద్య పరీక్షలు

కొత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని తాపీ మేస్త్రీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తొలుత జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వసంతరావు ప్రారంభించారు. ఎనభై మంది కార్మిక కుటుంబాలు వైద్యసేవలు పొందారు. శంకర్ ఫౌండేషన్ సభ్యులు పూసర్ల రాజా, కార్మిక సంఘం అధ్యక్షుడు చీర అప్పలరాజు, కార్యదర్శి మారేడిపూడి సత్యనారాయణ, నాయకులు గుమ్మాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఎమ్మెల్యే సత్కారం


వెంకటజయకు జ్ఞాపిక అందిస్తున్న పంచకర్ల

లంకెలపాలెం, మే 1 (ఆంధ్రజ్యోతి) పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో జిల్లాలో టాపర్‌గా నిలిచిన పెదముషిడివాడ జడ్పీ పాఠశాలలో చదివిన ఆర్సి వెంకటజయను గురువారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభినందించారు. వెంకటజయ స్వగ్రామం గండివానిపాలెం వెళ్లి సత్కరించారు. ఆమె తల్లిదండ్రులైన గంగరాజు, మహేశ్వరిలతో మాట్లాడి కుమార్తెకు ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. స్థానిక నాయకులు కరణం నరసింగరావు, ఆర్సి అప్పారావు, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత అక్కిరెడ్డి రమణబాబు మృతి

అనకాపల్లి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ సీనియర్ నేత, మాజీ వైస్ ఎంపీపీ అక్కిరెడ్డి రమణబాబు గురువారం కన్నుమూశారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, నియోజకవర్గ నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రమణబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీత రామారాజు వర్ధంతిని పురస్కరించి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీను జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ సహకారంతో కొయ్యూరులో నిర్వహించనున్నట్టు నిర్వహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం బ్రోచర్‌ను ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా నిర్వహకులుఅంబటి నూకరాజు, (పీఈటీ)అనిశెట్టి చిరంజీవి, జంపా సురేశ్, పొత్తూరు సోమన్నదొర మాట్లాడుతూ ఈ టోర్నీలో పాల్గొనే జట్టు ఈ నెల 3వ తేదీ లోగా రూ . 2500 ప్రవేశ రుసుం చెల్లించాలచాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, ట్రోఫీ అందజేయనున్నట్టు వివరించారు. మరిన్ని వివరాలకు 7288093041 కు సంప్రదించాలని సూచించారు.

'నేటి మన్యం బంద్‌ను విజయవంతం చేయండి'

అరకులోయ మే1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం చేపట్టనున్న మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధనకమిటీ పిలుపునిచ్చింది. బుధవారం ఆదివాసీ గిరిజనసంఘం భవనంలో ఈపోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీతో ఏజెన్సీ పరిధిలో 766 పోస్టులకు గాను ఆదివాసీలకు దక్కేది కేవలం 42పోస్టులు మాత్రమేనని తెలిపారు. గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు వంతల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 94 శాతం మంది నివాసం ఉంటున్న గిరిజనులకు 6శాతం ఉద్యోగాలు, 6శాతం నివాసం ఉంటున్న గిరిజనేతరులకు 94శాతం ఉద్యోగాలు కేటాయించాడాన్ని ఖండిస్తున్నామన్నారు. జీవో 3 తో ఆదివాసీ యువతకు ఉద్యోగాలు దూరమయ్యాయన్నారు. ఈస్థితిలో సీఎం చంద్రబాబు ఏజెన్సీలో 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేస్తామని ఇచ్చిన హామీ అమలు కోసం మన్యంబంద్‌కు పిలుపునిచ్చారన్నారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.జగన్నాధం, సహదేవ్, డీఎల్‌వో జిల్లా నాయకులు కొర్ర ప్రపన్న, ఆదివాసీ పరిరక్షణమ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, పెసా కమిటీ అధ్యక్షుడు ఎం.రమేశ్, రాజ్‌కుమార్, డీఎస్సీ అభ్యర్థులు గుజ్జెల సురేశ్, మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: జీవో -3 సాధన కోసం శుక్రవారం తలపెట్టిన మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ సరమండ శ్రీకాంత్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ బంద్ జయప్రదం చేసేందుకు ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల యజమానులు, వర్తక సంఘాల నాయకులు మద్దతు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు జీవన్ కుమార్, కుడుముల వెంకట రమణ, జంపరంగి ఝాన్సీరాణి, కుడుముల నాగమణి, కర్రా వెంకటదార, కిల్లో రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నాకు సీఐటీయూ మద్దతు

పాడేరురూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. సమస్యలపై ఐటీడీఏ కార్యాలయం వద్ద ఏపీఎంసీఏ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని గురువారం సందర్శించిన ఆయన ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు ఎల్.సుందరరావు, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో గిరి రైతులకు ఆర్థిక లబ్ధి



మాట్లాడుతున్న డీఏహెచ్‌వో డాక్టర్ నర్సింహులు

పాడేరురూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంలో గిరి రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని పశువైద్య శాఖ డీఏహెచ్‌వో నర్సింహులు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కేవ్స్ సంస్థ కార్యకర్తలకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న పెరటి కోళ్ల పెంపకంలో శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఏహెచ్ డాక్టర్.చంద్రశేఖర్, డాక్టర్.గణేష్, హైపవర్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, ప్రాజెక్టు మేనేజర్ గణేష్, అరుణ్‌కుమార్, పారావెటనరీమెన్స్ డి.అప్పలస్వామి, పి.సూరిబాబు, జి.మోహన్, కె.అనిల్‌కుమార్, భాగ్య, అఖిల పాల్గొన్నారు.

మొండికేసిన తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్



అంబులెన్స్‌ను నెడుతున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, మే (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో ఉన్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ అంబులెన్స్ మొరాయించింది. గురువారం సీహెచ్‌సీ నుంచి తల్లి బిడ్డను వారి స్వ గ్రామానికి తరలించేందుకు ప్రయత్నిస్తే ముందుకు కదలలేదు. దీంతో బాధితులు, స్థానికులు కలసి తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాన్ని కొద్ది సేపు తోయడంతో స్టార్ట్ అయింది. అనంతరం ఆ వాహనంలో తల్లి బిడ్డను తరలించారు. తరచూ ఇదే పరిస్థితి నెలకొంటోందని సమాచారం. తల్లి బిడ్డను తరలించే సమయంలో మొండి కేస్తే ఇబ్బందులు పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొయ్యూరులో మేడే జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



అరకులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వాడవాడలా ఘనంగా మేడే వేడుకలు

పాడేరురూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా మేడే వేడుకలను నిర్వహించారు. ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్.సుందరరావు పాల్గొని అరుణపతాకావిష్కరణ చేశారు. జీసీసీ డీఎం కార్యాలయ ప్రాంగణంలో మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాటంతో 8 గంటల పనిదినాన్ని సాధించుకున్న రోజు మే డే అన్నారు. ఈ స్ఫూర్తితో కార్మికులు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలుకు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సుందరరావు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గౌరినాయుడు, దేముడు, అప్పారావు, అర్జున్, బొజ్జన్న, రాజు, సూరిబాబు, ముత్యాలమ్మ, పుణ్యవతి, అంబిక, కుమారి, ఏఐటీయూసీ నాయకులు అమర్, వివిధ యూనియన్‌ల కార్మికులు పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రపంచ ప్రగతి కార్మికుల శ్రమతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీఐటీయు నేతలు వై. అప్పలనాయుడు, ఎస్. సూరిబాబు పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించి గురువారం సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో అంతాడ, డౌనూరు గ్రామాల్లో మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికుల పోరాట స్ఫూర్తి, చైతన్యానికి ప్రతీక మేడే అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు , హెల్పర్లు యూనియన్ నేతలు,ఆశ కార్యకర్తలు ఆటోరిక్షా కార్మికులు రైతు సంఘం, వీవోఏ, వీఆర్ఏ తదితర సంఘాల ప్రతినిధులు సీపీఐ, సీపీఎం, నేతలు ఉల్లి సూరిబాబు, సత్యనారాయణ, దేముడు, మాదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచారు.

అరకులోయ: కార్మికులను బానిసలుగా మార్చే కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్ర ధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. యండపల్లివలసలో నిర్వహించిన మేడే కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ కార్యదర్శి భగత్‌రాం తొ పాటు ఐటీడీఏ వర్కర్సు యూనియన్, కార్పెంటర్స్‌వర్కర్సు యూనియన్, అంగన్‌వాడీ వర్కర్సు యూనియన్, ఐకేపీ, వీవోఏ సంఘం, ఆటోవర్కర్సు యూనియన్ ,హాస్టల్స్ వర్కర్సు యూనియన్, టూరిజం, హాస్పిటల్ భవన కార్మికుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. నాలుగు లేబర్‌కోడ్స్ రద్దుకు ఈ నెల 20వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

హుకుంపేట: మండల కేంద్రంలో భవన కార్మికులు ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ఈ కార్య క్రమంలో వైస్ ఎంపీపీ కొండలరావు పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నాయకులు హైమావతి, కృష్ణారావు సిదేశ్, నూకరాజు మురళీ, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: సీఐటీయూ నాయకులు, కార్మికులు తాజంగి గ్రామంలో, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు చింతపల్లిలో మేడేను ఘనంగా జరుపుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్, నాయకులు సాగిన చిరంజీవి, సీపీఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, నాయకులు ఎస్కే రహిమాన్, రామణ, రాంబాబు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: సీపీఎం నాయకుడు గడుతూరి సత్యనారాయణ మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, వెలుగు వివోఏ, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూ, మిడ్ డే మీల్స్ వర్కర్లు, విద్యుత్, హాస్పిటల్, పాఠశాలల శానిటైజేషన్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి జెండాను ఆవిష్కరించారు. ఆయా సంఘాల నాయకులు శంకర్, రవి, త్రినాథ్, అనిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం: కలెక్టర్

పెదబయలు, మే 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని మారుమూల ఎగువపేడాపల్లిలో జలజీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న గ్రావిటీ పథకం పనులను గురువారం పరిశీలించారు. అలాగే, ఆయన వివిధ గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. పలువురు పలుసమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. జడిగూడలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు. దీంతో గ్రామానికి ఇప్పటికే మంజూరైన జలజీవన్ మిషన్ పథకం కింద రూ. 8 లక్షలతో పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. గ్రామ సమీపంలో కిలోమీటరు దూరంలో ఉన్న ఊటను ఆయన సందర్శించారు. ఈ ప్రదేశంలో కుండీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనాలను పరిశీలించారు. వనబంగిలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనానికి అంచనాలు వేస్తే నిధులు మంజూరు చేస్తానని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నిమ్మగుంట నుంచి లబ్బరి వరకు కిలో మీటరు తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. పింఛన్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ పేర్కొన్నారు. గురువారం మండలం వనబంగి పంచాయతీ మారుమూల పీవీటీజీ గ్రామమైన జడిగూడలో ఆయన స్వయంగా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ జి.రంగారావు, డీఆర్‌డీఏ ఏపీఎం ఎన్.దేవమంగ, ఏవో శ్రీనివాసరావు, డీఈఈ గోపాలకృష్ణ, ఏఈ మత్స్యలింగం, మండల ఇంజనీరింగ్ అధికారి శివరామయ్య, ఉపాధి ఏపీవో సూరిబాబు, వైస్‌ఎంపీపీ కొర్రా రాజబాబు, వనబంగి పంచాయతీ సర్పంచ్ కొర్రా కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎగువపేడాపల్లిలో జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వైభవంగా ముత్యాలమ్మ వార్షికోత్సవం



అమ్మవారి పాదాలకు పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, రాధ దంపతులు

చింతపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ ఆలయ పదో వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, రాధ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు సారెను తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అర్చకుడు జగన్ ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనతరం అమ్మవారి పాదాలను గ్రామ పురవీధుల్లో భక్తులు ఊరేగించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోలాటం, థింసా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం డ్యాన్స్ మస్తీ అలరించింది. నే కోలాటం, థింసా నృత్య ప్రదర్శించిన నేరేడువలసకు చెందిన గిరిజన మహిళలు, వలంటీర్లుగా పనిచేసిన సత్యసాయి సేవా సమితి వలంటీర్లను ఆలయ కమిటీ, మాజీ మంత్రి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి వినాయకరావు, పెదిరెడ్ల బేతాళుడు, కోలాటం, థింసా కళాకారుల అధ్యక్షురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు మోదకొండమ్మ ఆలయం ముస్తాబు



రంగులతో కళకళలాడుతున్న మోదకొండమ్మ ఆలయం

పాడేరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరగనున్న ఉత్సవాలకు స్థానిక మోదకొండమ్మ ఆలయం ముస్తాబవుతున్నది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి కొత్త రంగులు వేసే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో అమ్మవారి ఆలయం ఎంతో ఆకర్షణీయంగా కళకళలాడుతూ కనిపిస్తోంది. ఈ వారంలో అమ్మవారి విగ్రహానికి అలంకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. గతానికి భిన్నంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు తెలిపారు.

సామాజిక పింఛన్లతో కుటుంబాలకు భరోసా: జీసీసీ చైర్మన్ కిడారి

అనంతగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీతో వృద్ధులు, వితంతువులు, దివ్యాగులకు భరోసా కలిగిందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, పింఛన్‌దారులను పలకరిస్తూ, యోగక్షేమాలను తెలుసుకుని పింఛన్ల అందించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ..తొలుత పింఛన్లు ప్రవేశపెట్టింది దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల నగదు మొత్తం పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత మేలు చేశారని కొనియాడారు. ఆరోపణలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పింఛన్లు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో ఏవీవీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, నాయకులు టి.ఆనందరావు, ఎమ్.జోగులు, నిర్మల, లక్ష్మణ్‌రావు, సుందరరావు, ఎస్.డొన్ను, జీసీసీ డైరెక్టర్ డి.లక్ష్మి, సన్నిబాబు, అప్పలస్వామి, కో ఆప్షన్ సభ్యుడు మదీన, తదితరులు పాల్గొన్నారు.



చిలకలగెడ్డలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం: గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్: పేద ప్రజలకు అండగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం ఆమె వంతాడపల్లి పంచాయతీ కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారు. రూ. 3 వేలు ఉన్న పింఛన్ రూ. 4 వేలుకు పెంచిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కొండంగిలో తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, నాయకులు కోడా వెంకట సురేష్‌కుమార్ కొత్తాబు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు డప్పోడి వెంకటరమణ, బాకూరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి తరలిన కూటమి నాయకులు

పాడేరురూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో శనివారంజరగనున్న రాజధాని పునఃప్రారంభ పనులకు వస్తున్న ప్రధాని మోదీ సభకు జిల్లా నుంచి కూటమి ప్రభుత్వ నాయకులు గురువారం భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, నాయకులు బొర్రా నాగరాజు, డప్పోడి వెంకటరమన తదితర ముఖ్యనాయకులు పాడేరు నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు 5 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు.

చింతపల్లి: అమరావతిలో శుక్రవారంజరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు అత్యధిక సంఖ్యలో గిరిజనులు తరలి వెళ్లారు. గురువారం టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బస్సులో గిరిజనులు అమరావతి ప్రయాణమయ్యారు. అమరావతి వెళ్లావారిలో మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈబస్సులను స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేత రీమల ఆనందరావు, కేశ్వరావు, అర్జున్, సోమేశ్, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

అరకులోయ: ప్రధానమంత్రి మోదీ సభకు అరకు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో బయలు దేరి వెళ్లారు. స్థానిక పెదలబుడు సర్పంచ్ పెట్టెలిదాసుబాబు, తదితరులున్నారు.

జి.మాడుగుల: ప్రధాని నరేంద్ర మోదీ సభ గురువారం కూటమి నాయకులు అమరావతి తరలి వెళ్లారు. స్థానిక ఎంపీపీ ఎల్. అప్పలరాజు ఆధ్వర్యంలో 17 పంచాయతీల టీడీపీ, జనసేన బీజేపీ ముఖ్య నాయకులతో పాటు ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల సిబ్బంది తరలి వెళ్లారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వి.కొండలరావు, కల్యాణం, భీంబాబు, అప్పారావు, ఈశ్వరరావు, కృష్ణమూర్తి, ప్రభుత్వ సిబ్బంది తదితరులు ఉన్నారు.



అరకులోయనుంచి బయలుదేరి వెళ్తున్న నాయకులు

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణతకు ప్రత్యేక శిక్షణ



ప్రత్యేక కోచింగ్ క్యాంపులో హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఏటీడబ్ల్యూవో

కొయ్యూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సార్వత్రిక పరీక్షల్లో తప్పిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులంతా త్వరలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా వారికి శిక్షణ అందించాలని మండల సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి (ఏటీడబ్ల్యూవో) క్రాంతికుమార్ హెచ్‌ఎంలను ఆదేశించారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మండలంలో ఏర్పాటు చేసిన కొయ్యూరు, రాజేంద్రపాలెం ప్రత్యేక కోచింగ్ సెంటర్ల ను ఏటీడబ్ల్యూవో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సార్వత్రిక పరీక్షల్లో తప్పిన 41 మంది విద్యార్థులకు గానూ 16 మంది విద్యార్థులు, 11 మంది విద్యార్థినులు హాజరైనట్టు గుర్తించారు. మిగిలిన విద్యార్థులు కచ్చితంగా కోచింగ్‌కు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. అనంతరం పరీక్షల్లో సబెక్టుల వారీగా తప్పిన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో వెంట చిట్టింపాడు, సీఏహెచ్, కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల- 2, రాజేంద్రపాలెం ఆశ్రమమ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరదా?

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. అయితే లబ్ధిదారుల్లో పలువురు అనర్హులు వున్నారంటూ వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో సర్వే చేయించి, పలువురి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. వీరికి సంబంధించిన పట్టాలను రద్దు చేశారు.

విశాఖ దక్షిణం లబ్ధిదారులకు అనకాపల్లిలో ఇళ్లు!

సత్యనారాయణపురంలోని టిడ్కో కాలనీలో రెండు వేల ఫ్లాట్లను అనకాపల్లి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు, 744 ఫ్లాట్లను విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని వారికి 2022లో వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. వీరిలో 2,529 మంది రిజిస్ట్రేషన్‌లు కూడా చేసుకున్నారు. ఇంకా 215 మంది రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్రజాప్యం చేసింది. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిపోయాయి. గత ఏడాది సాధారణ ఎన్నికల ముందు టిడ్కో కాలనీలకు మౌలిక వసతులు కల్పించేందుకు వైసీపీ నాయకులు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. కానీ పనులు మాత్రం కొనసాగలేదు. కొంతమంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. సత్యనారాయణపురం టిడ్కో కాలనీలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో గతంలో గృహప్రవేశాలు చేసినవారు ఇళ్లకు తాళాలు వేసుకుని, వేరేచోట అద్దె ఇళ్లల్లో వుంటున్నారు.

కోర్టు పరిధిలో కొండకొప్పాక, సిరసపల్లి ఇళ్లు

కొండకొప్పాకలో 288 ఇళ్లు నిర్మించగా.. వైసీపీ పాలకులు వీటిలో తొమ్మిది ఇళ్లను మాత్రమే అనకాపల్లి నియోజకవర్గ పేదలకు కేటాయించి, మిగిలిన 279 ఇళ్లను విశాఖ దక్షిణ నియోజకవర్గం లబ్ధిదారులకు కేటాయించారు. సిరసపల్లిలో నిర్మించిన 384 ఇళ్లల్లో అనకాపల్లి నియోజకవర్గానికి 13 మాత్రమే కేటాయించారు. మిగిలిన 371 ఇళ్లను విశాఖ దక్షిణ నియోజకవర్గం లబ్ధిదారులకు ఇచ్చేశారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో వుంది. కోర్టులో కేసు తేలిన తరువాతే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి రావడంతో టిడ్కో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. గత ఏడాది ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టిడ్కో ఇళ్ల స్థితిగతులపై పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారుల ద్వారా సర్వే చేయించింది. దీంతో టిడ్కో ఇళ్ల కేటాయింపులు త్వరగా జరుగుతాయని లబ్ధిదారులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అమరావతికి ఆర్టీసీ బస్సులు

... 5వ పేజీ తరువాయి

వెళ్లాల్సి వచ్చింది. అమరావతిలో మోదీ సభకు ప్రజలను తరలించడానికి ఆ ప్రాంతంలో వున్న ఆర్టీసీ బస్సులతోపాటు విద్యాసంస్థల బస్సులు తీసుకుంటే సరిపోయేదని, అనకాపల్లి జిల్లా నుంచి బస్సులు పంపడం వల్ల రెండు రోజులపాటు స్థానిక ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రీసర్వే గడువు కుదింపు

... 5వ పేజీ తరువాయి

చర్యలు చేపట్టింది. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో ఆయా గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించడంతో రీసర్వే బాధితులు పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు, ఫిర్యాదులు అందించారు. మిగిలిన గ్రామాల్లో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. నర్సీపట్నం డివిజన్‌లో 357 గ్రామాలు ఉండగా వైసీపీ హయాంలో 208 గ్రామాల్లో సర్వే చేపట్టారు. మిగిలిన వాటిలో 12 గ్రామాల్లో మొదటి విడత రీసర్వేని జనవరి 20 నుంచి ప్రారంభించారు. రెండో విడత మరో 15 గ్రామాలు చేర్చి 27 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతీ 300 ఎకరాలకు ఒక సర్వే బృందం పని చేస్తున్నది. ఈ బృందంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు ఇద్దరు, వీఆర్‌వో, వీఆర్‌ఏ ఉంటారు. మండల సర్వేయర్, ఒక వీఆర్వో ఈ బృందానికి సపోర్టు ఉంటారు. మొదట విడత 12 గ్రామాల్లో సర్వే పనులు ముగింపు దశకు వచ్చాయి. రెండో విడత 15 గ్రామాల్లో సర్వే పనులు వివిధ దశల్లో వున్నాయి. అయితే కొన్నిచోట్ల రైతుల మధ్య సరిహద్దు వివాదాలు, రైతుల వద్ద సరైన రికార్డులు లేక పోవడం, ఉమ్మడి కుటుంబాల్లో ఆస్తుల పంపకాలు జరగకపోవడం వంటివి రీ సర్వేకి ఆటంకంగా మారాయి.

రీసర్వేకి రైతులు సహకరించాలి

ఎంఆర్‌పీ బాబు, జిల్లా సర్వేయర్ (1ఎన్‌పీ2)

ఎండ తీవ్రత కారణంగా మండల, గ్రామస్థాయి సర్వేయర్లు ఉదయం 7.30 గంటలకే క్షేత్ర స్థాయిలో ఉండాలని ఆదేశించాం. గ్రామ సచివాయల సర్వేయర్లు విధిగా ఆన్‌లైన్ హాజరు వేయాలి. రైతులు తమ హక్కు పత్రాలు చూపించి సర్వే సిబ్బందికి సహకరించాలి. రీసర్వే పూర్తయితే పక్కాగా రికార్డు రైతుల చేతిలో ఉంటుంది.

ఆద్యంతం గందరగోళం

... 5వ పేజీ తరువాయి

పనిచేసి ప్రస్తుతం దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న రామచంద్ర మోహన్, మరొకరు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు. వారికి ఉత్సవాల నిర్వహణలో అపార అనుభవం ఉంది. కమిషనర్ కూడా గత వారం రోజులుగా ఇక్కడే ఉండి అన్నీ చూసుకుంటున్నారు. ఇంత పెద్ద ఉత్సవాలు ఒకరిద్దరి చేతులు మీదుగా కాకుండా ఎక్కువ మంది బాధ్యతలు పంచుకొని ఉంటే బాగుండేదని, ఈఓ త్రినాథ్‌కు సెలవు ఇవ్వకుండా ఉండాల్సిందని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించినా క్షేత్రస్థాయిలో ఉండి చూసుకోవలసింది దేవదాయ శాఖ అధికారులే కావడం వల్ల ఇప్పుడు నింద వారిపైనే పడింది. ప్రభుత్వం నలుగురు మంత్రులతో కమిటీని నియమించింది. వారంతా ఒకసారి సమావేశం నిర్వహించారు. ఆ తరువాత అన్నీ హోం మంత్రి వంగలపూడి అనితే చూసుకున్నారు. ప్రమాద ఘటన జరిగిన తరువాత రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటివరకూ కనిపించలేదు. అనగాని సత్యప్రసాద్ స్వామి దర్శనం చేసుకొని వెళ్లిపోయారు. ఎవరూ తమకు పట్టని వ్యవహారంలానే భావించారు. సహాయక చర్యల నుంచి మృతదేహాలకు పోస్టుమార్టం వరకూ హోం మంత్రి అనిత దగ్గరుండి చూసుకున్నారు. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అడపాదడపా వెళ్లి ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. ఇక ఎంపీ ఎం.శ్రీభరత్‌కు ఈ ఉత్సవ ఏర్పాట్లలో భాగస్వామ్యమే కల్పించలేదు. ఆయన్ను ఏ సమావేశానికీ ఆహ్వానించ లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశాఖలో యూనిటీ మాల్

... 5వ పేజీ తరువాయి

చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.110 కోట్ల వ్యయంతో జీ+4 భవనం నిర్మిస్తారు. ఇంటీరియర్ డెకరేషన్, ఇతర వసతులకు రూ.62 కోట్లు ఖర్చు చేస్తారు. వచ్చే ఏడాది మార్చికల్లా దీని నిర్మాణం పూర్తవుతుంది. యూనిటీ మాల్ మొదటి రెండు అంతస్థుల్లో 62 షాపులు వుంటాయి. మూడో అంతస్థు నుంచి సముద్రం చూసేలా వ్యూపాయింట్ ఏర్పాటుచేస్తారు. నాలుగో అంతస్థులో కన్వెన్షన్ హాలు, రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు, రిక్రియేషన్ జోన్, ఫిట్‌నెస్ సెంటర్, బ్యాంకు శాఖలు, ఫర్నీచర్ స్టోర్లు ఉంటాయి. ఏటికొప్పాక బొమ్మలు సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారుచేసే చేతివృత్తులు ఈ మాల్‌లో విక్రయిస్తారు.

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి
రూ.6.55 కోట్లు మంజూరు

▸▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తొమ్మిది రోడ్ల అభివృద్ధికి రూ.6.55 కోట్లు మంజూరైనట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ 20.68 కిలో మీటర్ల రహదారులను మెరుగు పరుస్తామన్నారు. గొలుగొండ మండలం కాకరపాడు ఆర్అండ్బీ రోడ్డు నుంచి అమ్మపేట వరకు 1.6 కిమీ రోడ్డుకు రూ.50 లక్షలు, జోగింపేట నుంచి సాలికమల్లవరం వరకు రెండు కిమీ రోడ్డుకు రూ.75లక్షలు, చోద్యం, విప్పలపాడు మీదుగా గదంపాలెం వరకు మూడు కిమీ రోడ్డుకు రూ.90 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. మాకవరపాలెం మండలం తాళ్లపాలెం నుంచి జెడ్.గంగవరం వరకు 1.6 కిమీ రోడ్డుకు రూ.45 లక్షలు, నర్సీపట్నం మండలం వేములపూడి నుంచి పెద ఉప్పరగూడెం వరకు 1.6 కిమీ రోడ్డుకు రూ.60 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తామన్నారు. కృష్ణాపురం నుంచి బుచ్చన్నపాలెం మీదుగా వేములపూడి వరకు 3.68 కిలోమీటర్లు బీటీ రోడ్డు అభివృద్ధి చేస్తామన్నారు. నాతవరం మండలం పీకేగూడెం నుంచి లక్ష్మీపురం వరకు 1.6 కిమీ రోడ్డును రూ.50 లక్షలతో, తాండవ కూడలి డి.యర్రవరం నుంచి కురువాడ మూడు కిలోమీటర్ల రోడ్డును రూ.1.35 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు.

యోగాతో మనో వికాసం



శిక్షణ శిబిరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

మాకవరపాలెం, మే 1 (ఆంధ్రజ్యోతి) : అన్ని వయస్సుల వారి మనో వికాసానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని గౌతిమి లలిత కళా శిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు పి.రంగరాజు అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ యోగా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఈ శిబిరంలో పిల్లలు, పెద్దలు అందరికీ యోగా నేర్పిస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు ఆసనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయుడు శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా పింఛన్ల పంపిణీ



చినగొలుగొండపేటలో పింఛన్ నగదు అందిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

నాతవరం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్ల నగదును అందజేశారు. చినగొలుగొండ పేటలో తాండవ రిజర్వాయర్ కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మర్రిపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకుందాం

▸▸ కార్మికులకు పిలుపునిచ్చిన నాయకులు ▸▸ వాడవాడలా ఘనంగా మే డే వేడుకలు



కృష్ణాదేవిపేటలో జెండా ఎగురవేస్తున్న కళాసీల సంఘం జిల్లా అధ్యక్షుడు లగుడు



జోగంపేట గ్రామంలో...

నర్సీపట్నం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి) : కార్మిక దినోత్సవాన్ని మండలంలోని పలుచోట్ల గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నంతో పాటు గబ్బాడ, చెట్టుపల్లి, వేములపూడి, అమలాపురం, నీలంపేట, ఓఎల్ పురం, ధర్మసాగరం గ్రామాల్లో సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ రంగ కార్మికులు జెండాలను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులోకం ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు నిరంతరం పోటారాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా నాయకులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని జోగంపేట, చీడిగుమ్మల, గొలుగొండ, గుండుపాల గ్రామాల్లో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి పలుచోట్ల జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వామపక్షాల నాయకులతో పాటు ఆటో, భవన నిర్మాణ తదితర రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : కార్మిక దినోత్సవాన్ని గొలుగొండ మండలం ఏఎల్పురం జీసీసీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జీసీసీ కళాసీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లగుడు సీతయ్యనాయుడు, సీపీఐ సీనియర్ నాయకుడు మేకా సత్యనారాయణ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం వల్ల సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కార్మికులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, భవన నిర్మాణ రంగ కార్మికులు, అంగన్వాడీ సిబ్బంది ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక నాయకులు మేకా భాస్కరరావు, అంగన్వాడీ కార్యకర్తల సంఘం కార్యదర్శి మంగతాయారు, చింతల అప్పలనాయుడు, లగుడు రమణ, తానారి రాజు, సత్తిబాబు, నారాయణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో మే డేను ఘనంగా జరుపుకున్నారు. మాకవరపాలెం బస్ స్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులు, అంగన్వాడీ, పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. అలాగే గిడుతూరులో ఉపాధి హామీ పథకం కూలీలు ర్యాలీ నిర్వహించగా, ఎంపీడీవో సీతామహాలక్ష్మి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ చినబాబు, టీడీపీ నాయకులు బుచ్చి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాకవరపాలెం మండలం గిడుతూరులో ఉపాధి కూలీల ర్యాలీ



నాతవరంలో అరుణ పతాకం ఎగురవేసి నినాదాలు

నాతవరం : కార్మిక దినోత్సవాన్ని మండల కేంద్రం నాతవరంతో పాటు శృంగవరం, సరుగుడు డి.యర్రవరం గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.ప్రసన్న పలుచోట్ల జెండాను ఎగురవేసి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి, హక్కుల సాధనకు కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సత్యవతి, రాజేశ్వరి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీబాయి, కన్నతల్లి, ముఠా కార్మిక సంఘం నాయకులు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో సీఐ గోవిందరావు

నర్సీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిది నెలలుగా పరారీలో ఉన్న హత్యాయత్నం కేసు నిందితుడ్ని గురువారం అరెస్టు చేసినట్టు సీఐ గోవిందరావు తెలిపారు. గత ఏడాది ఇక్కడ జరిగిన గొడవలో కృష్ణాబజార్కు చెందిన కర్రి అజయ్కుమార్పై హత్యాయత్నం కేసు నమోదైందన్నారు. నాటి నుంచి పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రిమాండ్ విధించినట్టు చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

గొలుగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్టు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన లెక్కల నర్సింగరావు గత నెల ఏడో తేదీ రాత్రి తొమ్మిది గంటల నుంచి కనిపించడం లేదని అతని భార్య కుమారి ఫిర్యాదు చేసిందన్నారు. అప్పటి నుంచి ఆచూకీ కోసం పలు గ్రామాల్లో తిరిగినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

'సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం'



గిడుతూరులో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం, మే 1 (ఆంధ్రజ్యోతి) : సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. గిడుతూరు గ్రామంలో ఉన్న సంపద కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. సంపద కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం చూపరాదని ఆదేశించారు. అనంతరం తడి, పొడిచెత్త వేర్వే చేయడం వల్ల ప్రయోజనాలు గ్రామస్థులకు వివరించారు. మాజీ సర్పంచ్ చినబాబు, టీడీపీ నాయకులు రాంప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

4న నీట్

▸▸ విశాఖలో 16 పరీక్ష కేంద్రాలు
▸▸ మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష
▸▸ విద్యార్థులు గంట ముందే హాజరవ్వాలి
▸▸ ఒంటిగంటకల్లా గేట్లు మూసివేత

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్) లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'నీట్' ఈనెల నాలుగో తేదీన నగరంలోని 16 కేంద్రాల్లో జరగనున్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రవేశ పరీక్షకు సుమారు ఐదు వేల మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు జరగనున్న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 11నుంచి కేంద్రాలకు అనుమతిస్తారు. ఒంటి గంట తరువాత కేంద్రాల గేట్లు మూసివేస్తారు. అంటే గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి.

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల పెద్దమనసు

▸▸ ఆరు నెలల బాలుడి ఆపరేషన్కు రూ.లక్ష విరాళం

అనకాపల్లి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలల బాలుడికి ఆపరేషన్కు ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసి తమ గొప్ప మనసును చాటుకున్నారు. గొలుగొండ మండలం చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్.నవీన్కుమార్ ల్యాబ్ టెక్నీషియన్గా పనిచేస్తున్నారు. ఇతని ఆరు నెలల కుమారుడికి గుండెలో రెండు హోల్స్ ఉన్నందున ఆపరేషన్ నిమిత్తం ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు విరాళాలను సేకరించారు. సదరు నగదు రూ.లక్ష చెక్కును గురువారం ఇక్కడ నవీన్కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షులు తిరుపతిబాబు, జిల్లా అధ్యక్షురాలు కె.గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం: ఇద్దరి అరెస్టు

రావికమతం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసినట్టు అనకాపల్లి జిల్లా కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన అందించిన వివరాలివి.. కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన కసిరెడ్డి విద్యా సాగర్ అతని భార్యకు కొత్తకోటకు చెందిన యర్రా శ్రీనివాస్ భార్యకు బంధుత్వం ఉంది. దీంతో విద్యాసాగర్ గత కొంతకాలంగా తనను ఎంపీడీవోగా పరిచయం చేసుకుని సెక్రటేరియట్ అధికారులతో తనకు పరిచయాలున్నయంటూ పలువురు నిరుద్యోగులను నమ్మించాడు. తహసీల్దార్ ఉద్యోగానికి రూ.25 లక్షలు, వీఆర్వో పోస్టుకు రూ. 6లక్షలు, ఇతర ఉద్యోగాలకు 3 లక్షలు చొప్పున ఇవ్వాలని కోరారు. ఇలా.. రూ.32 లక్షలు పలువురు నుంచి వసూలు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. డబ్బులిచ్చి నెలల గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతోపాటు ఫోన్లోనూ సమాధానం ఇవ్వలేదు. ఈ స్థితిలో తన కుమార్తె ఉద్యోగం కోసం రూ. 6లక్షలు ఇచ్చి మోసపోయిన బాధితుడు యర్రా శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కసిరెడ్డి విద్యాసాగర్, అతని బంధువు కోటనందూరుకు చెందిన మలిచెట్ల శ్రీనును అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అలాగే, విద్యాసాగర్ విజయనగరం జిల్లా ఎల్. కోట పోలీస్స్టేషన్ పరిధిలో కసిరెడ్డిపాలెం స్వగ్రామం. అక్కడ కూడా మోసగించాడు.. కోటనందూరులో ఇదే తరహాలో మోసగించి ఓ యువతిని రెండవ వివాహం చేసుకున్నట్టు తెలిసింది.

మోదకొండమ్మ జాతరకు ముహూర్తపు రాట



శతకంపట్టు వద్ద ముహూర్తపురాట వేస్తున్న దృశ్యం

మాడుగుల, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగులలో . జూన్ 3వ తేదిన జరిగే మోదకొండమ్మ జాతర సంబంధించి గురువారం స్థానిక శతకంపట్టు వద్ద ముహూర్తపు రాటను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేశారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం అమ్మవారి చాటింపు, ఘటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి శతకం పట్టువద్ద కొలువుంచుతారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనాథ శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యనాయుడు, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలరావు, బొమ్మిశెట్టి శ్రీను, బసవ పరమేశ్ పాల్గొన్నారు.

చింతపండు ధర పతనం.. గిరిజనులు నిరాశ



సంతలో చింతపండుతో గిరిజనులు

చీడికాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం సంతలో చింత పండు ధర ఒక్కసారిగా పడిపోయింది. గత వారంతో పోలిస్తే 40 శాతం వరకు ధర తగ్గడంతో గిరిజన రైతులు తీవ్ర నిరాశ చెందారు. మధ్యాహ్నం 12 వరకు వేచిచూసినా ఆశించిన ధర లభించలేదు. దీంతో వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చి ఇళ్ల వెళ్లిపోయారు. గత ఎనిమిది వారాలుగా చింతపండు ధర పెరుగుతుండడంతో ఈ వారం కూడా అదే పరిస్థితి ఉంటుందన్న ఉద్దేశంతో గిరిజన రైతులు పెద్ద మొత్తంలో చింతపండు తీసుకువచ్చారు. అయితే గత మూడు రోజుల నుంచి ఆయా గ్రామాల్లో భారీ వర్షాలు పడడంతో చింతబొట్టలు తడిసిపోయాయి. దీనివల్లకొనుగోలుకు వ్యాపారులు ముందుకురాలేదు. గత వారం 20 కిలోల చింతపండు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు ధర పలకగా ఈ వారం రూ.900 నుంచి రూ.1,000కి పడిపోయింది. అయినా తిరిగి మోసుకువెళ్లలేక వ్యాపారులకు గిరిజనులు విక్రయించాల్సి వచ్చింది.

ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని సూదివలస గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. అలాగే, దీపం -2 పథకంలో భాగంగా గ్యాస్ సిలెండర్లను లబ్ధిదారులకు అందించారు. పశువులకు నీటి తొట్టెలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కొనియాడారు. మండల ప్రత్యేక అధికారి ఆర్. పూర్ణిమదేవి, ఎంపీడీవో సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, జూరెడ్డి రాము, బొడ్డు అక్కునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, దొగ్గ ఉమాశంకర్, కొటాన రాము, సబ్బవరపు రామునాయుడు, మాజీ సర్పంచ్ యాళ్ల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట : సీఎం చం ద్రబాబు ఆదేశాలపై కుటుంబ యజమాని మృతి చెందితే ఆ స్థానంలో వారి భార్యకు వితంతు పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు టీడీపీ మండల ఇన్చార్జి బంటు రాజు పేర్కొన్నారు. గురువారం కొవ్వూరులో నీలాపు అమ్మాజి, వి.అచ్చియ్యమ్మలకు మంజూరైన నూతన పింఛన్లను పంపిణీ చేశారు.

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట, వడ్డాది, చిన అప్పన్నపాలెంలలో కొత్తగా మంజూరైన ఎనిమిది మందికి పెన్షన్లు స్థానిక ఎంపీడీవో విజయలక్ష్మి గురువారం పంపిణీ చేశారు.మండంలో 10474 మంది పెన్షన్దారులకు రూ. 4,53,85000, నిధులు విడుదలయ్యాయన్నారు.

కొత్తపెంట ఆలయంలో చోరీ

దేవరాపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట శివారు కొత్తూరులో పైడిమాంబ ఆలయంలో రూ. 4 లక్షల విలువైన ఆభరణాలు చోరీ అయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు తెలిపారు. గురువారం ఉదయం గుర్తించి ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, అనకాపల్లి క్లూస్టీం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. అమ్మవారి మెడలో పావుతులం పుస్తెలతాడు, మూడున్నర కిలోలు వెండి ఆభరణాలు, కిరీటం తదితర వాటిని ఆగంతకులు అపహరించుకుపోయారు.

ప్రధాని మోదీ సభకు తరలిన కూటమి శ్రేణులు

రోలుగుంట, మే 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధాని మోడీ బహిరంగ సభకు మండలం నుంచి కూటమి శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మాడుగుల రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవల్లి అగ్రహారంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీనాధు రమేశ్ (ఎల్ఐసీ) తన తల్లి జ్ఞాపకార్థం వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో ఈశిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 350 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలలో వైద్యులు పాల్, మురళీకృష్ణ, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ దేవత గుడి నిర్మాణానికి దాతల విరాళాలు

రావికమతం,మే1,(ఆంధ్రజ్యోతి): మండలంలో గుడ్డిపలో చేపడుతున్న భూలోకమ్మతల్లి గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన బలిరెడ్డి ప్రకాశరావు (మాజీ ఆర్మీ ఎస్బీఐ), శ్రీనివాసరావు(ఉపాధ్యాయుడు) కలసి రూ.10,116 విరాళంగా గురువారం అందించారు. గల్లా అప్పారావు, నాగమణి దంపతులు,చిరంజీవి, నాగేశ్వరావు రూ. 5,116 నగదును విరాళంగా అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు మజ్జి అప్పారావు, పిల్లా రమణ, గల్లా స్వామి, పి.అప్పారావు,ఎం.నాగేశ్వరావు,జి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కె. కోటపాడు సబ్ రిజిస్ట్రార్గా కిశోర్



కె.కోటపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సబ్ రిజిస్ట్రార్గా ఎం. కిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్గా పనిచేస్తున్న ఆర్. శకుంతల పదవీవిరమణ చేయడంతో ఆమె స్థానంలో విశాఖపట్నం డిఐజీ ఆఫీస్ నుంచి బదిలీపై ఇక్కడకు కిశోర్ వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వ చ్చి రైతులు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి క్రయ విక్రయాలు జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

లైసెన్స్ రెన్యువల్ చేయని సినిమా థియేటర్ సీజ్



రావికమతంలో శ్రీవెంకటేశ్వర టాకీస్ను సీజ్ చేస్తున్న తహసీల్దార్, అధికారులు

రావికమతం,మే1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర టాకీస్ను తహసీల్దార్ బి. వెంకటరమణ సీజ్ చేశారు. గురువారం ఆయన ఈ సినిమా హాల్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గతేడాది మేలోనే ఈ థియేటర్లో సినిమాల ప్రదర్శనలకు ఉద్దేశించిన బీ ఫారం గడువు ముగిసినా నేటికీ లైసెన్స్ పునరుద్ధరించుకోలేదని గుర్తించారు. దీంతో థియేటర్లో ఇకపై ప్రదర్శనలు నిలిపివేయాలని లీజ్దారునికి తహసీల్దార్ ఆదేశించారు. అలాగే, ఈ థియేటర్లో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. థియేటర్ పరిసరాల్లో తాగి పారేసిన మద్యం సీసాలు ఉండడాన్ని గుర్తించిలీజు దారుడును తహసీల్దార్ మందలించారు. ఈ తనిఖీలో ఆర్ఐ సతీశ్, ఏఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపు చేయనున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలోని అలమండ, వేచలం ఫీడర్లో ములకలాపల్లి, కొత్త పెంట, ఎన్.జి.నగరం, వేచలం, బి.కింతాడ గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.2.5 కోట్ల వ్యయంతో శ్రామిక భవన నిర్మాణం

▸▸ మేడే వేడుకల్లో ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, మే1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో వివిధ శ్రామిక వర్గాల కోసం రూ.2.50 కోట్ల వ్యయంతో శ్రామిక భవనం నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. వివిధ వృత్తులలో ఉన్న కార్మికులందరికీ ఉపయోగపడేలా ఈ భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముందుగా భ వన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం నాయకులు కొసర తాతారావు, ఆకుల దేముడు, గౌరినాయుడు, పెమ్మె బాబ్జి పాల్గొన్నారు.

పట్టణంలో నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో పాతబస్టాండ్ మోటారు వర్కర్స్ కార్యాలయం వద్ద ఎర్రజెండా ఎగరేశారు. బానయ్యకోనేరు వద్ద ఇఫ్టూకార్యాలయంలో నిర్వహించిన మే డే వేడుకల్లో నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, కిల్లి దేముళ్లు, స్త్రీ విముక్తి సంఘటన్ నాయకురాలు లక్ష్మీకుమారి, , ఎన్వై ఎస్ నాయకులు నందారపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ గూనూరు వరలక్ష్మి, వి.వి. శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మేడే జెండాలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు చిన్నబ్బాయ్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు లోవరాజు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య జయంతి నిర్వహించి, మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

కె.కోటపాడు: కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు అన్నారు. గురువారం మేడే సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడిబాబు ఆధ్వర్యంలో మర్రివలస, పాతవలస, దాలివలస, రామచంద్రపురం గ్రామాల్లో సీపీఐ జెండాలను ఎగుర వేశారు. సీపీఐ నేత గొర్లె దేవుడుబాబు, రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు, సీమునిరి సూర్యనారాయణ, వర్రి అప్పారావు, దమ్ము ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: మండల కేంద్రం లో సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో స్థానిక పారిశుధ్య, ముఠా కార్మికులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కార్మికులు ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించుకోగలరని తెలిపారు. ముఠా కార్మికులు అప్పారావు, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: రావికమతం, కొత్తకోట గ్రామాలలో మేడే సందర్భంగా జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు వజ్రపు సత్యవతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె. గోవిందరావు, కేవీపీఎల్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, శ్రీ శాంతి ఆటో యూనియన్ అధ్యక్షులు బి. బుల్లిబాబు పాల్గొన్నారు.

చీడికాడ: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు విమర్శించారు. మేడే పురస్కరించుకొని చీడికాడలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి రాజీవ్ కళామందిరం వద్ద జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల కార్మికులు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

దేవరాపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మేడే జెండా ఎగుర వేశారు. సీఐటీయూ నేతలు సూరిబాబు, రాము,ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో బంగారుమెట్ట కోనెం చెరువులో ఉపాధి కార్మికుల సమక్షంలో సీఐటీయూ నేతపి సాంబశివ రావు జెండా ఆవిష్కరించారు. , రాజాంలో దివంగత కామ్రేడ్ నాగులాపల్లి సత్యనారాయణ విగ్రహానికి, ఆకులనాగేశ్వరరావు, మరిసా సతీశ్, నరేశ్ నివాళులర్పించారు. విద్యుత్, భవన నిర్మాణకార్మికులు, కళాశీలు మేడే నిర్వహించారు.